క్లుప్తంగా

వినాయకుని సేవలో ప్రముఖులు



మాజీ పీసీసీఎఫ్ ప్రవీణ్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర అటవీ శాఖ మాజీ పీసీసీఎఫ్ ప్రవీణ్‌కుమార్, చిత్తూరు జిల్లా ఫారెస్ట్ డీఎఫ్‌వో చైతన్య రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



డీఎఫ్‌వో చైతన్య రెడ్డికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

స్వామివారి సేవలో అద్దాల మేడ నిర్మాణ దాత



మహేశ్వర్ రెడ్డికి స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని గురువారం అద్దాల మేడ నిర్మాణానికి విరాళం ఇచ్చిన మహేశ్వర రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రధాన ఆలయంలో స్వామివారి వెనుక భాగంలో రాగి రేకుపై బంగారం తాపడానికి ఖర్చును తాను భరిస్తానని తెలిపారు.

కవాతు రిహార్సల్ పరిశీలన



రిహార్సల్ పరిశీలనలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం కవాతు రిహార్సల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి శ్రీనివాసమూర్తి, బాబు ప్రసాద్, శ్రావణ్‌కుమార్, మురళీధర్, నీలకంఠేశ్వరరెడ్డి, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా పాలాభిషేకం



పాలకావళ్లతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరులో గురువారం శ్రీ కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో పాలాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈశ్వర గుడివీధిలోని అగస్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులతో పాలకావళ్లను ఊరేగింపుగా చెంగల్రాయ కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయానికి చేరుకుని అభిషేకం చేశారు. ట్రస్టు నిర్వాహకుడు వెంకటేష్, అర్చకుడు శివ పాల్గొన్నారు.

కార్యాలయాల ముస్తాబు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన రైల్వేస్టేషన్

చిత్తూరు కార్పొరేషన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరులోని పలు కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. జాతీయజెండా రంగులతో లైట్స్ వేసి చూడముచ్చటగా సిద్ధం చేశారు.

28న గుర్తింపు కార్డుల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: టూవీలర్ మెకానిక్స్‌కు ఈ నెల 28న స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు చిత్తూరు టూవీలర్స్ మెకానిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, మురగేషన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డీటీసీ నిరంజన్‌రెడ్డి, జిల్లా కార్మిక శాఖాధికారి ఓంకార్‌రావు, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

గుడిపాల: ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, పూతలపట్టులో విద్యార్థుల మానవ హారం, ఐరాల: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు







ఓటు మన హక్కు



యాదమరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



చిత్తూరు కార్పొరేషన్ : ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి కరుణకుమర్, సీఈవో ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాస్వామ్యంలో ఓటు మనందరి హక్కు అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పోలింగ్ శాతం పెరిగినప్పుడే ఓటుపై అవగాహన పెరిగినట్టని భావించాలన్నారు. పీఐయూ ఈఈ రమణయ్య, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు వరం లాంటిది

పూతలపట్టు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఈఆర్వో శివయ్య తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో పూతలపట్టులో ర్యాలీని నిర్వహించారు. మానవహారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేశారు. పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈఆర్వో శివయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వరంలాంటిదన్నారు. ఎంపీడీవో గౌరి, డీటీ లు మహేశ్వరి, హిమగిరి, మునికృష్ణ, హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, టీచర్లు మోహన్‌రెడ్డి, నాదముని తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

గుడిపాల: మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం గుడిపాలలో నరహరిపేట జెడ్పీ హైస్కూల్, సీఎస్ఆర్ కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంఈవోలు రామ్‌నాయక్, గణపతి, సర్పంచ్‌లు రజనీకాంత్, జనార్ధన్ పాల్గొన్నారు.

దేశ భవితను మార్చేది ఓటు

ఐరాల: దేశ భవితను మార్చే శక్తి ఓటుకు ఉందని తహసీల్దార్ సుశీలమ్మ తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవోలు రుషీంద్ర బాబు, దామోదర్‌నాయుడు, ప్రిన్సిపాల్ రెడ్డిరామ రాజు, హెచ్‌ఎం కోమల పాల్గొన్నారు.

ఓటు మన బాధ్యత

బంగారుపాళెం: దేశ ప్రగతిని మార్చే శక్తి ఓటుకు ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బంగారుపాళెంలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగురోడ్ల కూడలి వరకు సాగింది. అక్కడ మానవ హారం ఏర్పాటుచేసి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సమాజాన్ని ప్రగతి బాట వైపునకు తీసుకు వెళ్లే శక్తి ఓటుకు ఉందన్నారు. ఎంఈవో–2 రమేష్‌బాబు, హెచ్‌ఎం రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

యాదమరి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ హనుమంతు కోరారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో శివరాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటుచేసి అధికారులు, టీచర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

నేటి విద్యార్థులే రేపటి ఓటర్లు

తవణంపల్లె: నేటి విద్యార్థులే రేపటి ఓటర్లని, ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తవణంపల్లె హైస్కూల్లో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, నరేష్, భూసర్వే డీటీ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- వెలుగు కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎం రవి ఆధ్వర్యంలో సీసీలు, సంఘమిత్రలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.







ఐరాల: సీనియర్ సిటిజన్లకు సన్మానం, బంగారుపాళెం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, తవణంపల్లె : సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న అధికారులు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



చిత్తూరు కలెక్టరేట్ : ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నగరంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలలు, కార్యాలయాల్లో ఓటు విలువను వివరించారు. జిల్లా యంత్రాంగం తరపున గాంధీ సర్కిల్ వద్ద విద్యార్థులు మానవహారం ఏర్పాటుచేసి ఓటు విలువపై అవగాహన కల్పించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గిరింపేట మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, నాగేంద్ర, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్‌వో రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు దినోత్సవంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



చిత్తూరు కలెక్టరేట్ : ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, విద్యార్థులు



చిత్తూరు కలెక్టరేట్ : ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌వో రాజశేఖర్, తదితరులు



చిత్తూరు కలెక్టరేట్ : పీవీకేఎన్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి



చిత్తూరు కలెక్టరేట్ : గాంధీ సర్కిల్ వద్ద విద్యార్థుల మానవహారం

ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయాలి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో శనివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో అనేక సామాజిక రుగ్మతలు దూరమయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో ఆకృత్యాల నియంత్రణకు స్వయం సహాయక సంఘాలు కీలకంగా పనిచేయాలని సూచించారు. భారతదేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ వ్యవస్థను కాపాడుకోవాలన్నారు. కూతురు, కొడుకు విషయంలో వివక్ష ఉండకూడదన్నారు. అనంతరం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో మానవ హారం ఏర్పాటుచేశారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి, డీపీఎంలు వెంకటేశ్, రవి, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి గోశాలకు ఆవు, దూడ దానం



ఆవుదూడలకు పూజలు చేసి పచ్చిగడ్డి తినిపిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు



రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గోశాలకు గురువారం చెన్నైకి చెందిన రామసుబ్బారెడ్డి నాటు ఆవు, దూడను దానం చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, అర్చకులు ఆవు, దూడకు పూజలు చేసి పచ్చిగడ్డి తినిపించి గోశాలకు తరలించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు చిత్తూరుకు చెందిన నిహార్‌టేకస్ రూ.లక్ష విరాళం అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జనన, మరణాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

యాదమరి : గర్భిణులు, జనన, మరణాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వైద్యాధికారి సురేఖ ఆదేశించారు. ఆమె గురువారం ఏఎన్‌ఎంతో సమావేశమయ్యారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.1.40 లక్షల ఆదాయం

బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన వాహనాల వేలంలో ప్రభుత్వానికి రూ.1,40,900 ఆదాయం వచ్చినట్టు సీఐ నాగరాజరావు తెలిపారు. మండలంలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలు, కారును సెబ్ డీఎస్పీ బాబుశ్రీధర్ సమక్షంలో వేలం వేసినట్లు తెలిపారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. శాస్త్రోక్తంగా సుదర్శన హోమం చేశారు. రాత్రి ఉత్సవ మూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈవో హనుమంతరావు పాల్గొన్నారు.

ఇంటింటా కులగణన

తవణంపల్లె: మండలంలోని 32 పంచాయతీల్లో కుల గణన జోరుగా సాగుతోంది. వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

బంగారుపాళెం : మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. వ్రతం ఆచరించడం ద్వారా కలిగే ఫలితాల గురించి కేశవానంద స్వామి భక్తులకు వివరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

పూతలపట్టు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం పూతలపట్టు మండలం పోలవరం మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో గౌరి టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. తవణంపల్లి, పూతలపట్టు మండలాల జట్లు తలపడగా పూతలపట్టు జట్టు విజేతగా నిలిచింది. అలాగే బంగారుపాళ్యం, యాదమరి జట్ల మధ్య జరిగిన పోటీల్లో యాదమరి జట్టు విజయం సాధించింది. 27వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్‌లో పూతలపట్టు, యాదమరి జట్లు తలపడతాయని ఎంపీడీవో తెలిపారు. అలాగే బ్యాడ్మింటన్ పోటీలు చిత్తూరులోని ఇండోర్ స్టేడియంలో జరిగాయి. పురుషులు, స్త్రీల బ్యాడ్మింటన్ విభాగంలో పూతలపట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మాసిలామని, మణి, ప్రవీణ్, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో బంగారుపాళెం క్రీడాకారుల ప్రతిభ

బంగారుపాళెం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో బంగారుపాళెం క్రీడాకారులు సత్తా చాటారు. పూతలపట్టులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో వాలీబాల్‌లో బంగారుపాళెం సచివాలయం జట్టు, కబడ్డీలో తగ్గువారిపల్లె సచివాలయం జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులను గురువారం స్థానిక సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి జాతీయ స్థాయిపోటీలకు చేరుకోవాలని కోరారు.



పూతలపట్టు : క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో గౌరి



బంగారుపాళెం: వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ ఉమాదేవి, అధికారులు



బంగారుపాళెం:నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కబడ్డీ జట్టు

ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా



గుడిపాల: వికలాంగులకు కరపత్రం అందజేస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: చేసిన మేలును గుర్తించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన గురువారం చీలాపల్లె పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పొందిన లబ్ధిని, పథకాలను వివరించి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మహిళలు ప్రతి గడప వద్ద విజయానందరెడ్డికి హారతులు పట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఎన్నికల హామీలను 98.5 శాతం అమలుచేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఆడపడుచులు జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్, డెప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, సర్పంచులు రజనీకాంత్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్ రాయల్, మోహన్‌నాయుడు, గోపి, రమేష్, రవియాదవ్, నవీన్, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, యోవాన్, నాయకులు శిలంబరసన్, సాయి, రమణ, నాగేంద్ర, గుండుసాయి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీలేదు

- వైఎస్సార్ సీపీతోనే బీసీలకు పెద్ద పీట
- పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్



మాట్లాడుతున్న సునీల్‌కుమార్, కుమార్‌రాజా

బంగారుపాళెం: టీడీపీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా నివాసంలో బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బంగారుపాళెంలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సభలో ఆ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. చంద్రబాబు తన హయాంలో బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారని ఆరోపించారు. వెనుకబడిన కులాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని గుర్తుచేశారు. కుమార్‌రాజా మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందింది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనేనన్నారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి జిల్లాలో నలుగురికి చైర్మన్ పదవులు ఇచ్చారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు కలిసికట్టుగా పనిచేసి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈడిగ, కురబ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు యల్లప్ప, అమరనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, బీసీ నాయకులు కృష్ణమూర్తి, సురేంద్ర పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు బాలుడి అప్పగింత

చిత్తూరు రూరల్: తప్పిపోయిన బాలుడిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొన్ని గంటల్లోనే కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిత్తూరు నగరానికి చెందిన ఓవ్యక్తి తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి మామిడి తోపులో కాపలా పని కోసం మండలంలోని బీఎన్‌ఆర్‌పేటకు వెళ్లాడు. గురువారం ఉదయం 10 గంటలకు బీఎన్‌ఆర్‌పేట చెక్‌పోస్టులో బాలుడు తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు బిడ్డ కోసం గాలిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంతలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో బాలుడిని గుర్తించి కార్యాలయానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.



బాలుడి అప్పగింత